


# ఆలోకం నవ్వింది!

బుట్టలో పాములా స్తబ్దంగా వుంది ప్రకృతి. ఉక్కపోస్తూ వుంది జగతి. కర్మసాక్షి కన్నెర్రచేస్తే కలువలు మూతి ముడిచి, కెందామరలు విచ్చి వికసించాయి. గుక్కెడు నీళ్ళకోసం కొలనుగట్టు దిగాడు ముత్యాలు.

ఆమడ దూరానికి పైగా కాలికి కాలు కొట్టుకుంటూ నడవడం.... కడుపులో తడి లేకపోవడం....కడిగి తోసినట్లున్న ఆకాశం మిడిసిపడుతూ వుండడం—నిండు గుంటను చూసేసరికి ముత్యాలు పిడచగట్టిన పెదవులపై పోయిన ప్రాణం లేచివచ్చిన సంతృప్తి తొణికిసలాడింది. దుమ్మునిండిన మడమలు నీళ్ళలో మునిగాయి. దోసెడు నీళ్ళకోసం రెండుచేతులు కలిపి నీటిపైకి వంగాడు. నీళ్ళను అందుకోబోయి అలానే నిలబడిపోయాడు.

తీసి కాస్తున్న ఎండ....ఆకు అల్లాడకపోయేసరికి అలలు సన్నగిల్లి నిర్మలంగా ఉన్న నీళ్లు....ఆ నీటివెనుక కాలప్రవాహంలో ఉర్లిపడి, కాస్త దూరం దొర్లి, అక్కడ ఓ వెంట్రుకవాసి ఆధారానికి తగులుకొని కొట్టు మిట్టాడి నిలబడిన ఓ దీనాకృతి! ఎండి నెర్రలు చీలిన పులకమడిలో చచ్చీ

చావక నిలబడిన నాగులా తలమీద తేసిపోయిన వెంట్రుకలు.... పేదరికం లేకుండా పెరిగిన గడ్డం....పందెం వేసుకొని పీక్కుపోయిన కళ్ళు, బుగ్గలు..

అబ్బ! ఎంత వికృతంగా వుంది!

తన రూపం తనకే అసహ్యమనిపించేసరికి చూచి సహించలేక గబ గబ ఆ రూపాన్ని చెరిపివేశాడు ముత్యాలు. రెండుదోసిళ్ళ నీళ్ళతో ప్రాణం కుదుటబడింది.

ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏవేవో అభిప్రాయాలకు, అభి రుచులకూ అలవాటుపడ్డ రెండు జీవితాలను కలిపేది పెండ్లిపీట అయితే— అలాంటి రెండు పట్టణాలను కలిపే రాచబాట అది. అంగిట బెల్లముంచు కొన్నవాళ్ళు, నొసటితో వెక్కిరించగల నేర్పరులూ, తడిగుడ్డతో గొంతులు కోయగల నిపుణులూ, వేడినీళ్ళతో కొంపలు కాల్చగల కోవిదులూ.... స్వార్థులూ....నిస్వార్థులూ....అపర చాణక్యులమధ్య నివసిస్తూ, అందరికీ అనుగుణంగా జీవితాన్ని బహు చాకచక్యంగా ముందుకు లాక్కుపోగల ఓ మానవుడిలాంటి ఆ బాట మిట్టపల్లాలను, వంక, వాగులను, కొండ లోయలను అధిగమిస్తూ వచ్చి అక్కడ ఓ అర్ధవృత్తాకారాన్ని రూపొందించు కొనింది. ఒక్క దెబ్బతో రెండుపిట్టలు కొట్టగల ప్రజ్ఞాశాలుడయిన మాన వుడు ఆ అర్ధవృత్తాకృతిలో కాస్త మట్టినితీసి అవతల పోసి, ఆ బాట మలుపు వెంబడి చింతచెట్లు, వెలగచెట్లు నాటాడు. నిజము సంగతి యేమో కానీ, నీళ్ళు మాత్రం ఆ పల్లాన్ని గుర్తించి నిలకడగా నిలబడిపోతే అది మంచినీళ్ళగుంట అయింది. ఆ కట్టపై నాటినచెట్లు నీటి పట్టుతో బాగా ఎదిగి, శాఖోపశాఖలై వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కూడుపెట్టే తన యుల్లా పెంచిన మానవులకు చల్లని నీడ నిస్తున్నాయి. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగానో, లేదు—రాబోయే జన్మలో మరింత మంచి స్థితిని పొందాలనో వాంఛించిన మానవుడు ఆ వెలగచెట్టుక్రింద ఓ బండను తిన్నెలా అమర్చినాడు. ఆ బండమీద కూర్చుని నీరసించిన కట్టెలాంటి శరీ రాన్ని వెలగచెట్టుకు చేరగిలవేశాడు ముత్యాలు.

కాసేపు వూపిరి బిగబట్టి లోకాన్ని ఉక్కిరిబిక్కిరిచేసి ఆమీదట 'పోనీలే!' అని దయతలచి ఒక్కశ్వాసను వదిలాడో సమీరుడు—లేదు ఈ లాంటి అభాగ్యులను చూచి బాధగా నిట్టూర్చాడో తెలియదు కాని, ఎంతలో ఎంతమార్పు! మెల్లగా చెట్లు కదిలాయి. అంతకంటె మెల్లగా కదులుతూ ఆకులు వింజామరలు వీచాయి. ఆగాలి మంచినీటి మీదుగా వస్తూ, వస్తూ చల్లదనంతోపాటు మరింత సౌరభాన్ని వారకోని హృదయంగమంగా వీస్తూ వుంది. తల్లిప్రేమలాంటి చల్లని నీడ....అంతకంటె చల్లనిగాలి—నిద్ర చోటెరుగలేదు. ముత్యాలు మాగన్నుగా కన్నుమూశాడు.

"గానుగెద్దులా వున్నావ్! కళ్ళు కనబడ్డంలేదూ? ఊళ్ళోకి పోరా అంత తిండి దొరుకుతుంది!"

నీటికోసమో, చెట్టునీడ కోసమో నిలబడిన బాటసారులు కనీసం 'ఆకు వక్కయినా కొనకపోరులే!' అన్న తలంపుతో వెలగచెట్టుకు రెండు బారల దూరంలో పూరిగుడిసెలో చిల్లరంగడి జరుపుతున్న అలిమేలు కసిరింది. అదిరిపడి కళ్ళు తెరిచాడు ముత్యాలు! దిగులుగా, మనసులో గుబులుగా గుంటకట్ట దిగిపోతున్నా డొక పదేండ్ల పిల్లవాడు! ఈనెపుల్లను మరపించే చిన్నవాడు!! కాయకష్టం చేసి బ్రదికేవాళ్ళ కండ్లకత డొక సోమరి. కలిగినవాళ్ళ దృష్టి కతడొక ముష్టివెధవ! కాదు, గానుగెద్దు!!

"అసలు మానవుడు, ఆత్మాభిమానము, సిగ్గు, బిడియము—అదిగాగల, మానవత్వానికి మెరుగులు దిద్దగల సుగుణాలను వదలి, సాటి మానవుని ముందు 'దేహీ!' అని ఎందుకు చెయి చాపుతాడు?—అది పుట్టుకతో వచ్చినా గుణమా? లేదు పరిస్థితుల ప్రోద్బలమా?" ఈ భావన మనసులో మెదిలిందేమో? బాగా పెరిగిన గడ్డాన్ని వ్రేళ్ళతో రాచి, తడిమిచూచి పెదవి విరిచాడు ముత్యాలు. అంగడికి బేరం వచ్చిందేమో? అంతలోనే ఆప్యాయతను ఒలకబోస్తూంది అలిమేలు. అల్లంతదూరంలో ఎర్రని ఎండలో

ఎద్దులు లాగలేక లాగుతూంటే 'కిఱ్ఱు' మని శబ్దంచేస్తూ వుంది నూనె గానుగ. ముత్యాలు మనస్సు ప్రస్తుతం నుండి ఒక్కసారిగ ఇరవై సంవత్స రాల వెనక్కు తిరిగింది.

అప్పుడు తన వయస్సు సరిగ్గా అంతే! ఆ వెళ్ళిపోయిన పిల్లవాని కున్నంతే వుంటుంది. ఆ వయసులోనే తాను లోకంమీద పడ్డాడు. ఆకలి బాధకు తట్టుకోలేక, ఆర్జించే మార్గం గోచరించక అథవా గోచరించినా అందుబాటులేక, పిడికెడు కూటికి బోలెడు తిట్లు తిన్నాడు. చాలసార్లు చద్దామని ప్రయత్నించాడు. తానేమో ఎలుగెత్తి ఆహ్వానించినా తనవైపు చూడనయినా చూడలేదు చావు. అదేమి చిత్రమో, కావాలని కోరుకొని, అహరహము కలలు కని, అందుకై పరితపిస్తే అందుబాటు కావు కొన్ని! వద్దనుకొంటే కూడా అనుకోకుండా వచ్చి నెత్తిన పడతాయి మరికొన్ని!! లేకపోతే గీచిన గీతలా సవ్యంగా సాగిపోవలసిన బ్రతుకుబాట, వంకర టింకరలుగ చేసి వదలిందా ఒక్కమాట! ఆ ఒక్కమాటే తన లేత హృద యాన్ని కోతలా బాధపెట్టింది. యమపాశంలా గొంతుకు తగులుకొని బర బర లాగి విసిరి పారవేస్తే, కొండ కొమ్ముమీద పడ్డ రాయిలా తన బ్రతు కీనాడు....!

ఆరోజు తాను ఇంట్లోనే కూర్చుని అయ్యవారు చెప్పిన ఇంటి పాఠాన్ని వ్రాసుకొని వుంటే ఇంత జరిగేది కాదు. వ్రాయాలనే అను కొన్నాడు. అనుకోవడము, ఆచరణ ఏకమై, అనుకొన్నట్లుగ జరిగి పోతూంటే, ప్రగతికామియైన మానవుని పరిస్థితి ఎలా వుంటుందో మరి!? పలకా పుస్తకాలు తెచ్చి ముందర వేసుకున్నాడు. పుటికమీద బుడ్డీదీపం నిశ్చలంగా వెలుగుతూ వుంది. పుస్తకం విప్పబోయాడు. అంతలోనే పాట వినిపించింది. మనస్సు పాఠాలవైపునుండి పాటవైపు మొగ్గింది. పాట వినిపిస్తున్నవైపు దృష్టి మరలడంతో బయటితట్టు చూశాడు. దాదాపు జాముర్రాత్రి కావస్తూంది. పుచ్చ పూసినట్లు పున్నమినాటి పండు వెన్నెల.

చుట్టూరా పచ్చని పైరుచేలు. ఆ చేలు వుండుండి చిలకరించే పన్నీటిజల్లుల చల్లని గాలులు. ఆ గాలి మోసుకొస్తున్న పాట. జానపద గేయాల్లో వజ్రాల మూట!

"ఈదిలో గుమ్మిడి—ఇంటెనక సిక్కుడు
పోరాని కల్లకంత—సాయరా తీగె
నేనేమి రంకాడితి?
నా రంకయిన తెలపరా? రాజాతి మగడా?
నేనేమి రంకాడితి??"

కమ్మగా వినిపిస్తూంది పాట. తనకు తెలియకనే తన కాలు లయ నందుకొనింది. ఒక్క అడుగులో ఎగిరి నడివీధిలో పడ్డాడు.

పంచె మోకాలిపైకి ఎగతీసి గోచిపెట్టి, కాలికి గజ్జెకట్టి, సుంగువిడిచి తలకు పాగా చుట్టి, జోడు కోలాట పుల్లలు చేతబట్టి 'కోపు' పట్టారు కుర్ర కారు. పాట పాటకు కోలాటంపుల్లల లయ. లయకు దగ్గ అడుగు. దుమ్ము లేచిపోతూంటే, ఆ ఊళ్ళోవాళ్ళంతా రచ్చబండమీద, ఇంటి ముందు అరుగులమీద కూర్చుని చెవులు రిక్కించి వింటున్నారు.

ముత్యాలు హృదయం గంతులు వేసింది.

ఒక జత కోలాటపుల్లలు!అందుకొని తానూ జట్టులో కలిసిపోయాడు. పాట తారస్థాయి నందుకొనింది. 'అయ్....హా! అయ్!....హా!' అని అడుగు పాటకు తోడు కలిసింది. ముసలి మతక 'బలె బలె' అని మురిసి, అనుభవాలను నెమరువేసుకొంటూ ప్రోత్సహిస్తున్నారు. లోతు బావుల్లో నీళ్లు తోడి వెతలుబడ్డ రైతాంగము వేసవి వెన్నెల్లో, ఆనందపు వెల్లువల్లో తేలి, కాస్త సేద దీర్చుకొంటున్నారు.

"ధూత్" అన్నాడు ఉన్నట్లుండి రెడ్డికొడుకు.

కడివెడు పాలల్లో ఒక కల్లు ఉప్పులా పరిణమించిందా మాట.

ఆ మాటతో కోలాటం లయ తప్పి ఆగిపోవడం, తన చెంప 'ఛెళ్లు'

మనడం త్రుటిలో జరిగిపోయాయి. తానేమీ గ్రహించలేకుండా బిత్తరపడి తేలమొహం వేస్తే తన యిష్టమొచ్చినట్లు నోరు పారవేసుకొంటున్నాడు రెడ్డి కొడుకు. ఎవరో ఓ నడికా రాయన "ఏం జరిగింది నాయనా!" అంటూ ఆతురతగా ఆ జనంలో నుండి లేచి వచ్చాడు. "చూడండి! గాడిద!!—చేత కాకపోతే వూరకుండాలి! ఎవరు పిలిచా రీ వెధవను తాంబూలంపెట్టి?....చేతి కేసి కొట్టాడు" కొర కొర చూస్తూ, కోపాన్ని కక్కుతూ చేతివ్రేళ్ళు నొక్కుకున్నాడు రెడ్డి కొడుకు.

దెబ్బ తగిలిన చిహ్నాలేమీ కనుపించలేదక్కడ.

"పోనీలే! నాయనా! అబ్బ అమ్మకు పుట్టిన బిడ్డయితే అదుపు ఆజ్ఞ లుండి ఏడుస్తాయి. ఈ అతిమాత్ర ఎక్కడా యింతే" అని సర్దుబాటు చేశాడు మధ్యవర్తిగా ఆ నడికారాయన.

ముత్యాలు గుండెల్లో ముండ్లు గ్రుచ్చుకొన్నాయి. సాధారణంగా దారి నడిచేటప్పుడు తగిలే ముండ్లయితే కాసేపు ఏడిపించి విడిచిపెట్టుతాయి. కానీ, ఇవి సూటిగా గుండెల్లో గుచ్చుకొన్న ముండ్లు!

ముత్యాలు కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గుండెబరువుతో, నిండు వెరపుతో అక్కడనుండి చల్లగా జారుకొన్న ఓ స్త్రీ ఆకారాన్ని ఎవ్వరూ గమనించలేదు. మరొక్క క్షణం ముత్యాలు అక్కడ నిలబడలేకపోయాడు. మెల్లగా ముందుకు సాగాడు. రచ్చబండ దూరమవుతున్నకొద్దీ పిచ్చినవ్వులు మాత్రం భారంగా, కారంగా వెన్నాడుతున్నాయి బాధిస్తూ. ఆ బాధతోపాటు ఆలోచనలు.

అవును! తాను ఈ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదు. అసలు ఆలోచించే అవసరమే లేకపోయింది. ఏదో కూలినాలి చేసి అమ్మ అంత కూడు ముద్దుమురిపాలతో రంగలించి తినిపించడం, తాను బడికి వెళ్ళడంగా దశవర్షాలు మహర్దశను చవిచూశాయి. కానీ, ఈనాడు నలుగు రిలో తల ఎత్తలేని అవమానం జరిగింది. దీనికంతకూ కారణం అమ్మ!—

‘ఈవేళ ఏమైనా సరే!....అమ్మను నిలదీసి అడగాలి!’ అనుకొనేసరికి తన కాళ్ళు కొత్త వేగాన్ని పుంజుకొన్నాయి. ఇంట్లో అడుగుపెట్టాడు. పాత పూరిల్లు....పరిగపొదలాంటి పై కప్పు నుండి వానజల్లు, వెలుగు వెన్నెలలు నిష్పాక్షికంగా పారే యిల్లు....నేలంతా వెన్నెల పొదలు మింటిని చుక్కల్లా మినకరిస్తున్నయిల్లు—ఊరికి ఓ మూలగా, మూలుగుతూంది ఒంటిగా. అందులో పుటికమీద బుడ్డీ దీపం గాలి ధాటికి రెపరెపలాడుతూ ఉంది. ఎదురైన అమ్మ మొగం అంతకంటె ‘వెల వెల’ పోతూ ఉంది!

“ఏంవి నాయనా? పలకా పుస్తకాలు ఎక్కడివక్కడ పారేసి, ఆ పుటికమీది దీపాన్ని కూడా గూట్లో పెట్టకుండా, పరుగెత్తావే? ఇప్పుడే యిలాగయితే ఎలాగయ్యా?” గుండెను నమిలే బాధకు ముసుగు వేయాలని నసిగింది అమ్మ. ఆ మాటలు తన చెవుల్లో పడలేదు సరికదా? పడిన మాటలు మాత్రం తూట్లు పొడుస్తున్నాయి. తన నిర్ణయం మారలేదు.

“చెప్పమ్మా?....మా నాన్న ఎవరో చెప్పు?”

చూపులు సూటిగా ఉన్నాయి. మాటలు ఘాటుగా ఉన్నాయి. మేక కంటపడ్డ లేత ఆకులా అల్లాడిపోయింది ఆమె హృదయం.

“నిజమే! తాను ఆయనచేత వంచింపబడింది. తన జన్మకారకులెవరో తెలియని శైశవదశనుండి పంచన చేర్చి పెంచినారు. తనకు వయసు, వయస్సుతోపాటు అందం, అన్నిటికీ మించి అందుబాటు, గ్రహపాటుతో గృహిణి చెల్లుబాటు—జరిగేసరికి వినియోగించుకొన్నారు ‘పెండ్లి’ సాకుతో. వయస్సులు పోల్చిచూస్తే తండ్రి బిడ్డల తారతమ్యాని కేమాత్రం తీసిపోకపోయినా, కృతజ్ఞత అనేది ఈ లోకంలో ఉంటే అది మొదట తన గుండెల్లోనే పుట్టినట్టు భావించి అంగీకరించింది వివాహానికి, అంతరాత్మ అంగీకరించకపోయినా! తీరా తన కడుపు పండబోతున్న సంగతి తెలిసి వచ్చేసరికి ఆయనకు తన అంతస్థు, కులమూ, గోత్రమూ, గౌరవము అన్నీ తెలిసి వచ్చాయి. పోనీ, అంతటితో వదలి ఉండినా బాగుండేది. పలుకుబడితో

పదిమందిని పంచన చేర్చి తన్ను వాళ్ళముందు నిలబెట్టాడు ముద్దాయిలా. వారు చేరిన కారణం, వినబోయే మాటల తీరూ వూహించుకొనేసరికి తల కొట్టేసినట్లవుతూ వుంది. అయినా నిలబడకపోతే విధి లేదు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన గొంతు బాగా గద్గదికమై పోయింది. కళ్ళు చెమ్మ గిల్లాయి. ఎవరినీ ఉద్దేశించకుండా, దీర్ఘ స్వగతంలా, వూర్ధ్వదృష్టితో, తనలో తాను గొణుక్కున్నాడు.

"చిన్నప్పటినుండి పెంచి పెద్ద చేశాను. కడుపున పుట్టిన బిడ్డకంటె ఎక్కువగా ప్రేమించాను. అంతకంటె ఎక్కువగా ఆదరించాను. కాలం కలిసివస్తే ఎవడి చేతుల్లోనైనా పెడదామనుకొంటే...." అటుపై మాటలు పెగలనట్లుగ అసలే గద్గదికమైపోయిన గొంతు బాగా పూడుకుపోయింది. ఆ మాటలు చెవిని పడుతూ వుంటే, ఎదమీద ఎవరో సమ్మెటతో బాదిన ట్లుంది. విని నిభాయించుకోలేక ఒక్క విసురులో లోనికెళ్ళింది. వాళ్ళ మొగం చూడలేక కుంచించుకుపోయిన మనస్సు మాత్రం మళ్ళీ వాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంది.

పాపం! కాస్త తమాయించుకొని మరలా ఆరంభించాడు ఆ పెద్ద మనిషి. "అనకూడదు కానీ—అనరాని, వినరాని పనే చేసింది బుద్ధిలేని గాడిద—తాను చెయ్యరాని పనిచేసి నాచేత చెయ్యరాని........! రామ! రామ!! ఎలా భరించా లీ బాధను?"—వాలిపోయిన తలను రెండు చేతులు పొదివి పట్టుకొని సేదదేర్చితే, వేడి నిట్టూర్పులు మాత్రం కట్టలు త్రెంచు కొని బయటపడ్డాయి. ఆ వేడి ధాటికి కుప్పగ కూలిపోయింది తాను!

"ఎందుకు బావా? దీని కింతగా వగవడం? నాలుగు దన్ని మెడబట్టి అవతలికి గెంటితే సరి! నీ వెర్రిగానీ! హహ్హహా! కుక్కతోకకు దబ్బలు కట్టాలనుకున్నావ్?" ఏహ్యభావంతో బాహాటమైన బుద్ధిమంతుని మాటలు!

కల్పించిన మాట కలవారి నోట కఠోరసత్యమై నాటకం బాగా రక్తి కట్టింది. తన బ్రతుకు నడివీధిలో కడిగిపోసినట్లయింది. ఆత్మహత్య పాపా

నికి భయపడి, కడుపు తీపితో వూరుకాని వూరు చేరి వో కొడుకును కను క్కొనింది. ఆ కొడుకు ఈనాడు ఎదిగి, ఎదుట నిలబడి, నిలదీసి అడుగు తున్నాడు "ఎవరు తన తండ్రి?" అని.

"ఏమని చెప్పడం?"

"ఏమో, ఎందుకు చెబుతావ్?....జరిగిందేదో చెప్పు!"

"చెబితే నమ్మతాడా?"

"నమ్మించాలి మరి?"

"అంత అవసర మేమొచ్చింది?"

"అవసరముండేగా అడుగుతూండడం!"

"అందరి అవసరాలకు నేను బాధ్యురాలినా?"

"అందరి సంగతీ అటుంచు. వాడు నీ బిడ్డ!!"

"అందుకేగా ఇంకనూ బ్రతికిఉన్నాను."

"నీ బ్రతుకు వాడికి కంటకప్రాయంగా తయారవుతూంది!"

"అయితే చావనా?"

"చచ్చినా మచ్చ మచ్చే!"

....అనంతంగా సాగిపోయే ఆలోచనలు ఓ కొలిక్కి రావడంలేదు ఎంత ఆలోచించినా?

"చెప్పమ్మా! నే నడిగినదానికి సమాధానం చెప్పు!"

"ఇప్పు డెందుకులే నాయనా ఇదంతా? పెద్దోడైతే తెల్సుకుంటావులే!"

నోట్లోమాట నోట్లో ఉండగానే ఆమె గబగబ వెళ్ళిపోయింది. మారు మాట్లాడకుండా అక్కడినుండి కదిలాడు ముత్యాలు. బరువెక్కిన గుండెలను మోయలేక మోస్తున్నాయి అడుగులు. వెళ్ళి పడుకొన్నాడే కాని నిద్రపట్టలేదు.

"అసలు అమ్మ తప్పు చేయకుంటే ఎందుకిలా కప్పిపుచ్చుతుంది.

తండ్రిని తెలుసుకొనే హక్కు—పోనీ అదృష్టం బిడ్డకులేదా? 'నీకెందు కిదంతా అంటుందే!'—పోనీ, అమ్మకు నాదగ్గర దాపరికమెందుకూ? ఇదే నిజమైతే—ఉదయాన వూళ్ళోవాళ్ళ మొగ మెలాచూడాలి?"

ఆలోచించేకొద్దీ హృదయం కుతకుత ఉడికిపోతూ ఉంది. చూరుకప్పు బొరియలగుండా తొంగిచూస్తూ చందమామ "పిచ్చినాన్నా! పడుకొని నిద్ర పోరా!" అని హెచ్చరిస్తున్నాడు. ఎక్కడో నక్కల అరపులు....జొన్న చేలవద్ద కావలి కాస్తున్నవాళ్ళ అదలింపులు....పూరింటి అరుగుమీద పడు కొని వున్న ఓ స్త్రీ మూలుగులు....అర్ధరాత్రి సమయంలో అదో విధమైన రొద....ప్రకృతి పసిపిల్లల పల్లెకూటంలా వుంది.

మరునాటి ఉదయాన్ని వూహించుకొని ముత్యాలు తుంగచాపమీద గడగడ లాడిపోతున్నాడు. తెట్టెమీద తేనెటీగల్లా ముసిరిన ఆలోచనలు.... ఆగని కాలం....అర్ధరాత్రికి పైగా దాటినట్లుంది. ఆ పూరింట్లో ఏదో కదలిన శబ్దం—పిల్లిలా అడుగులువేస్తూ నీడలా నడిచింది ఓ ఆకారం. ఓ క్షణం నిలబడి వెనక్కు తిరిగి చూచింది. తొమ్మిది నెలలుమోసి యమయాతనతో ప్రసవించి, పది సంవత్సరాలు పోషించిన అమ్మ! పైటచెరగు పాన్పుగా కటికనేల తల్పంగా అరుగుమీద అస్తవ్యస్తంగా పడి నిద్రపోతూంది. లెక్కలేనన్ని ఆలోచనల ఫలితంగా రూపొందిన ఏదో నిర్ణయంతో ఘనీభ వించిన హృదయం, ద్రవిస్తే కండ్లు వాగులయినాయి. ఆ వాగుల్లో ఉవ్వెత్తుగా లేచిన సుడిగుండంలా వెలువడిన 'అమ్మా!' అన్న ఆర్తనాదాన్ని పెదవులు నొక్కిపట్టితే, ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాడు ముత్యాలు ఆ దృశ్యాన్ని చూచి. ఊళ్ళో వాళ్ళంతా అమ్మముందు నిలబడి వికటంగా నవ్వుతూ, తనవైపు అదోవిధంగా చూస్తూ, చెవులు కొరు క్కుంటున్నారు. ఒకప్రక్క పౌరుషము, ఒకప్రక్క అవమానము, తన్ను సమస్థాయిలో లాగుతుంటే, చూస్తూ సహించలేక, అటువైపు చూడలేక మొగాన్ని రెండు చేతులతో కప్పుకొని వెనక్కు తిరిగాడు. ఆ నిశీధిలో

ఎక్కడికో? ఎందుకో? గమ్యం తెలియని గమ్యానికి బయలుదేరాడు - ఏ రమ్యాతి రమ్యమైన ఆకర్షణలు అక్కడున్నాయో మరి?

ఆ మీదట తను జీవిత గుడారాన్ని తిండి దొరకని చోటునుండి, కాస్త తిండి దొరికే చోటుకు రవాణాచేస్తూ అక్కడ తిండికి బదులు తిట్లు తింటూ, ఏ చెట్టునీడనో తల దాచుకొంటూ, మరో ఏడెనిమిది సంవత్సరాలు నెట్టాడు. ఆ రవాణాలో ఓసారి రైలు ప్రయాణం తటస్థించింది. నడిరేయి....క్రిక్కిరిసిన మూడవతరగతి రైలుపెట్టె....ఎక్కడివా రక్కడ నిద్రమత్తులో వూగిసలాడుతున్నారు. వాకిలివద్ద కాస్త చోటుచేసుకొని నిలబడి వున్నాడు. కాళ్లు పీకుతూ, కళ్ళు మూతలుపడుతున్నాయి. చాల దగ్గరలో 'గుర్....గుర్' మన్న శబ్దం వినిపించింది. అటువైపు చూశాడు. అంత అవస్థలోకూడ చూస్తుంటే తనకు నవ్వు పుట్టుకొచ్చింది. ఓ లావుపాటి ఆసామి దానికి మించిన లాభసాటి వ్యాపారం లేదన్నట్లుగ పెట్టె తలగడగా, సామానులుంచే అటక పడకగా అమరివుంటే, గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఆ కొద్దిపాటి సౌఖ్యానికి మానవుడు పడే యాతనను గమనిస్తూ నిలబడ్డాడు ముత్యాలు. అంతలోనే ఏదో స్టేషను రావడం, బండి ఆగి కదలడం, మంచి వేగాన్ని లంఘించుకొనడం జరిగింది. ఆ కుదుపుల్లో అతడు ప్రక్కకు వత్తిగిలి, చేతిని తలగడగా సర్దుకొన్నాడు. రైలు యథావిధంగా నడుస్తూంది మహా మేరువులా పేరుకుపోయిన చీకటిని చీల్చుకుంటూ. చోటు దొరికినవాళ్ళు 'సౌఖ్యమంతా మాదే!' అన్నట్లు కాళ్లు నిగడదన్ని—ఒదిగి నిలబడ్డవాళ్ళు, కూర్చున్నవాళ్ళమీద అలిగి, 'మానవత్వము కరుణ, సర్దుబాటు'లాంటి పదజాలాన్ని చక్కటి వాక్యాలలో పొదిగి అందిస్తున్నారు. కొందరు ప్రభుత్వ నిందాస్తుతిలో పడ్డారు. 'దేనితో నాకు నిమిత్తంలేదు. గమ్యం నా లక్ష్యం!' అని పరుగులుతీసే రైలు మళ్ళీ ఆగింది.

అదొక చిన్న రైల్వేస్టేషన్. ఆ ప్రదేశమంతా చీకటి ఒడిలో ప్రశాంతంగా వుంటే, ప్లాట్‌ఫారం కొనల్లో పోర్టరు పొదుపు ఉద్యమంలో

ఇరుక్కొని కొన వూపిరితో ఉన్న రెండు కిరసనాయిలు దీపాలు, శాంతి భంగం చేయాలనేమో అల్లాడిపోతున్నాయి. కాస్త చోటు దొరికితే చాలు కాస్సేపు నడుం వాల్చవచ్చునన్న సదుద్దేశంతో నేమో? దిగేవాళ్ళని కూడా దిగనీయకుండా ఎగబడుతున్నారు ప్రయాణికులు ఉడ్డకు ముగ్గురు తక్కువైతే కూడా. ఆ బండి రాకకోసమే ఓ నిర్ణీత వేషంలో తయారయిన స్టేషను మాస్టరు పుట్టి మునిగినట్లు అటు, ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఈ పరిణామాన్నంతటినీ అధిగమిస్తూ "అయ్యో! నా పెట్టె!....నాపెట్టె!!" అన్న అరపులు వినబడేసరికి అందరూ అటువైపు చూశారు. పాపం! అటకమీద నిద్రమత్తులో గుఱక పెడుతూ ఉండిన ఆసామి, పెట్టెకోసం దేవులాడుతూ, దిగనుంకిస్తూ దిగలేక తంటాలు పడుతున్నాడు. ఇంతవరకు పెట్టె అతనికి తలగడగా ఉండటం అంత నిద్రలోకూడ అతడు అప్పు డప్పుడు పెట్టె ఉందో లేదో అని తడిమి చూసుకోవడం—గమనిస్తూనే ఉన్నాడు ముత్యాలు. అంత లోపలే మాయమయింది. 'ఆశ్చర్యంగా ఉందే!' అనుకొని ప్లాట్‌ఫారం వైపుచూశాడు. అంతవరకు తనప్రక్కన్నే నిలబడి వుండిన ఓ 'సూటు' మహాశయుడు చకచక నడచి వెళ్ళుతున్నాడు ప్లాట్ ఫారం మీద! చేతిలో పెట్టెవుంది. ఆ పెట్టెవైపు దీక్షగా చూశాడు. సందేహ మేమీలేదు. నిజంగా ఆ పెట్టె ఈ లావుపాటి ఆసామిదే! అంతే 'దొంగ! దొంగ!!' అని అరుస్తూ ఎగిరి ప్లాట్‌ఫారం మీదదూకి ఆ 'సూటు వాలా'ను వెంబడించాడు. 'దొంగ' అన్నమాట చెవిని పడటంతో అందరూ "దొంగ! దొంగ!!" అని ముక్త కంఠంతో అరిచారు—ఎవరు దొంగో! ఎక్కడి దొంగో!! అర్థం కాకపోయినా, తాము చూడకపోయినా.

స్టేషన్‌మాస్టర్ ఎఱ్ఱదీపం చూపాడు. అడుగు ముందుకు వేయలేదు రైలుబండి. ఆ పెట్టెలో ఓ ఆరేడుగురు దిగి అటువైపు పరుగెత్తారు. స్టేషన్‌మాస్టరు, గార్డుకూడా పరుగిడుతున్నారు దొంగకోసంకాదు—పోలీసు కోసం! మొదటి తరగతిలో మెత్తని పరుపులమీద మత్తునిద్రలో మునిగిన

పోలీసు ఒళ్ళు విరుచుకుంటూ, ఈ ఆర్భాటాలకు నసుక్కొంటూ పైకి లేచాడు. అనుకోని ఈ పరిణామంతో, పెట్టెను వదలిపెట్టి, చీకటిలో కలిసిపోయాడు సూటువాలా. 'పోతే పొయ్యాడు వెధవ! సొత్తు దక్కిందిలే!' అని పెట్టెను చేతి కందుకొన్నాడు ముత్యాలు. అంతే! పెట్టె చేతికి వచ్చిందో, లేదో! నాలుగు చేతులుకలిసి తనను పరామర్శిస్తే, ఆ గుంపును చీల్చుకొని వచ్చిన పోలీసు ఆకారం బాగా సత్కరించింది.

మాసిన గుడ్డలు.... పెరిగిన గడ్డము.... సంస్కారాన్ని చవిచూడని జుట్టూ, ప్లాట్‌ఫారంమీద ఎగిరిదూకి పరుగిడుతూంటే ఎక్కడో రాలిపోయిన టిక్కెట్టూ, తన సహృదయత చుట్టూ దిట్టంగా గోడలు కట్టాయి. తత్ఫలితంగా నాలుగేళ్ళు జైలుకమ్ములు లెక్కపెట్టాడు గోళ్ళుగిల్లుకుంటూ! అది కూడ అటూ యిటూకాదు. ఏ వైపునుండి ఏ కమ్మిని చూపినా దాని నంబరు కచ్చితంగా చెప్పగల సామర్థ్యం అలవడేవరకూ లెక్కపెట్టాడు. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన జైలు అధికార్లు అతనిని వదలిపెట్టారు, ఇక బ్రతకగలడన్న ధీమాతోనేమో?

ముత్యాలు బయటపడ్డాడు. కాదు—ఈ సంతలో అడుగుపెట్టాడు. నాలుగు గోడలమధ్య కూర్చొని, పాపం! అమాయకుడు ఏమేమో వూహించుకొన్నాడు. కానీ, ఇక్కడ ఒకటీ తన వూహకందలేదు. ఊహ కందింది అర్థం కావడంలేదు. ఏమిటో మరి?—రైళ్ళు పరుగెడుతూనే ఉన్నాయి. మోటార్లు, కార్లు, లారీలు పంతం వదలడంలేదు. కొనడం, తినడం, లేకపోతే ఏడవడంతో మానవులు పోటీ పడుతూనే వున్నారు. అన్నిటిని మించి ప్రొద్దు పుట్టుతూవుంది. పోతూ వుంది. ఏమిటో గమ్యం? ఇలాంటి స్థితిలో తనలాంటి వాళ్ళను గురించి ఆలోచించడానికి, కన్నీళ్లు కార్చకపోయినా కనీసం కాస్త సానుభూతినయినా ప్రకటించడానికి ఎవరికి తీరిక వుంటుంది తన పిచ్చి కానీ!

ఆ సంతలో తన పాత్రౌచిత్యాన్ని గురించి కాస్సేపు ఆలోచించవలసి

వస్తే, తన చిన్ననాటి విషయం ఒకటి గుర్తుకు వచ్చింది. తన పూరింటి నట్టింటి గూట్లో ఓ బుడిగ హుండి ఉండేది. పావలా కూలి డబ్బుల్లో ఓ కానీ మిగిల్చి అందులో వేస్తూ, శనివారంపూట ఉపవాసముండి ఆ హుండీని పూజించేది అమ్మ. “ఇదేంవిటమ్మా?” అని అడిగితే “ఏడుకొండలవాడి ముడుపు నాయనా!” అంటూ ఉత్తరంగా మళ్ళీ రెండుచేతులు జోడించేది. అలాంటి దేవుణ్ని తాను ఇంతవరకు చూడలేదు. తలంపు కలిగిందే తడవుగ నడక సాగించాడు.

కాస్త ఓపిక పట్టితే ఓపూట తిండి తిప్పలను, మరికొంచెం ఓపిక వుంటే ఓ రెండుమూడు రాత్రులు నిద్రను, ఆశను జయిస్తే ఈ ప్రపంచంతో సంబంధాన్ని వదులుకోవచ్చునేమో కానీ, ఎంత నిబ్బరమున్నా ఈ ఆలోచనల్ని అవతలికి నెట్టడం అసాధ్య మనిపిస్తుంది. కీకారణ్యంలో దట్టమయిన పొదల్లా ఎదురయ్యే ఆలోచనల్ని అతి ప్రయత్నంతో తప్పుకొంటూ, ముందుకు సాగిపోతున్నాడు ముత్యాలు!

మిట్ట మధ్యాహ్నం. నడిమిట్టన నీలుగుతూండిన సూర్యుడు కాస్త పడమటిప్రక్కకి వాలి మబ్బులమాటున మినకరిస్తున్నాడు. బాటప్రక్కన్నే వూడలు దిగిన మర్రిచెట్టు బాటసారుల వరప్రసాదినిలా వుంది. ఆ చెట్టు క్రింద కూర్చున్నాడు ముత్యాలు. కాళ్లు కుక్కలు పీకినట్లు లాగుతున్నాయి. కడుపు మండిపోతూవుంది. చేతిలో చిల్లిగవ్వలేదు. భవితవ్యం దుర్గమంగా తోస్తే, ఏమిచేయనూ తోచకుండా, ఆ చెట్టువంక పరిశీలనగా చూస్తున్నాడు. కనువిప్పి విప్పని ‘కార్ కార్’ మంటున్న గువ్వపిల్లలు చిదుగు బొదుగు గూటిలో తల్లిగువ్వ మేత ముక్కు కందిస్తూ వుంటే, కేరింతలు కొడుతున్నాయి. గూటి నిర్మాణంకోసం యాతన పడుతున్న సాలెపురుగును ఏమరితే కబళిద్దామని పొంచివుంది ఒక బల్లి. రెండు గువ్వలు ఆకుల మాటున ఓ రెమ్మమీద కూర్చుని మూగభావాల ముద్రలో మురిసిపోతున్నాయి. గోలకు మారుపేరు కాకులుకూడ నిందను మాపుకోవాలనే గుట్టుగ

కూర్చున్నాయి. అనంతవిశ్వాన్నే జ్ఞప్తికి తెస్తూ ఉంది ఆ మర్రిచెట్టు. అన్ని జీవరాసులకు ఆయువుపట్టు!! ఆ జీవరాసులపై ఆ మర్రిచెట్టుకున్న మమత మానవాళిలో ఉంటే....!

ఇక ఆలోచించలేకపోయాడు ముత్యాలు. దృష్టి మరోవైపు మళ్ళింది. ఇంకనూ దాదాపు మైలుదూర మున్నట్లుంది తిరుపతి. అతి సమీపంలో విశ్వ విద్యాలయ భవనాలు సర్వశోభాయమానంగా వున్నాయి. మధ్యాహ్న భోజనా నంతరమేమో కళాశాలల్లో చదివే అమ్మాయిలంతా చకచక నడిచిపోతూంటే సందెడు పుస్తకాల బరువుతో సన్నని నడుములంతా ఒగిరిస్తున్నాయి. వాళ్ళను చూస్తుంటే ముత్యాలు కళ్ళు చెమ్మగిల్లాయి. అవును! తన చదువు సరిగ్గా సాగివుంటే, తానుకూడా ఈవరకు ఇలా కళాశాలల్లో చదువుతూ ఉండవలసింది. ఇంకనూ చదువడమేమిటి? ముప్పైయేళ్ళు నెత్తిమీద సవారి చేస్తుంటే! ఈ పాటికి ఏదైనా ఉద్యోగం చేస్తూ అమ్మను పోషిస్తూ ఉండే వాడు. అమ్మ!....ఏమైపోయిందో, ఏమో? తనలాంటి ఓ నిర్భాగ్యుణ్ని కని, గాలికి వదలి, తాను కదలీ మెదలకుండా కూర్చుని ఉంటుంది. తాను సమాజపు కట్టుబాట్లు త్రెంచుకొని తనకు ఓ కట్టుబాటు లేకుండా చేసింది లోకంలో! నలుగురి నోళ్ళల్లో నానేటట్లు చేసింది! ఆమెను గురించి ఆలో చించడం కూడా....!

కామెర్లకంటి వానికి ప్రపంచమంతా పచ్చగా గోచరించినట్లు, పిరికి వాని కంటికి లోకమంతా అనుమానాస్పదంగా గోచరిస్తుంది. "నీది తప్పుడు పుట్టుక! ఈ సంఘంలో నీకు తావు లేదు" అని వేలెత్తి చూపించే ఓ అను మానభూతం ఆవరిస్తే ఆ మర్రిచెట్టు బోదెకు ఆనుకుని పరధ్యానాన్ని పరా మర్శిస్తున్న ముత్యాలు 'కెవ్వు' మన్న కేకతో ఎగిరిపడ్డాడు. పాపం! గడ గడలాడుతూ తన మెడకు బల్లిలా హత్తుకపోయింది ఆ కసుగందు. ఒక్క 'సడన్ బ్రేక్'తో లారీని నిలబెట్టిన 'డ్రైవరు' 'హమ్మయ్యా!' అని నిట్టూర్చి పట్టిన చెమటను కాస్త తుడుచుకొని తమాయించుకొని ముందుకు సాగి

పోయాడు. ముత్యాలు పాపను మరలా మర్రిచెట్టు క్రిందికి మోసుకొని వచ్చాడు. క్రింద దింపాడు. చెట్టులోనే రంగు తిరిగిన నిమ్మపండులాంటి పసిమి చాయ....నాలుగైదు సంవత్సరాల వయస్సు ఉంటుందేమో!.... ముద్దులమూట కట్టినట్లుంది పాప. చెవులో లోలకులు, మెడలో గొలుసు, మంచి దుస్తులు, కలిగినయింటి బిడ్డగానే కనిపిస్తూ ఉంది. దడ తీరలేదేమో? ఇంకనూ వణికి పోతూనే ఉంది.

"నీ పేరేమిటమ్మా?" గోముగా బుజ్జగిస్తూ అడిగాడు ముత్యాలు.

"లమ" ముద్దుపాల మూటలోనుండి ఓ ముద్దు—కాదు ఓ మాట జారిపడితే ముత్యాలు హృదయం ఆనందాన్ని వారు (దోచు) కొనింది.

"మీ యిల్లెక్కడమ్మా?"

చేయెత్తి చూపింది పాప! అటువైపు చూశాడు. బాటకు దక్షిణంగా, కవలపిల్లల్లా కావిరంగుతో ఒకదాన్ని చూసినట్లు మరొకటిగా ఓ అయిదారు మేడ లున్నాయి. ప్రతి యింటి చుట్టూ ప్రహరీగోడ, ఆ గోడ లోపల తోట....ఆ తోట లోపల మధ్యగా మేడ....ఊహను దృఢపరచుకున్నాడు ముత్యాలు.

"....అయితే ఈ ఎండలో ఎందుకిలా వచ్చావమ్మా?"

"ఆలుకోటానికి!" నిస్సంకోచంగా సమాధానం చెప్పింది రమ.

"ఇంటిముందరో, లేదు, ఈ చెట్ల క్రిందనో ఆడుకోకుండా బాట కాప్రక్క కెందుకెళ్ళావమ్మా? ఎప్పుడూ బస్సులు, లారీలు, కార్లు పరుగెత్తుతుంటాయే!" మెల్లగా మందలించాడు ముత్యాలు.

"నా బంతి పోయింది! బంతికోసం నే నెల్లాను!" చేతిలోని బంతి వైపు అదోలా తాను చూచుకొంటూ, తనకు చూపింది రమ.

పాప తెలివికి పూబంతి అయింది ముత్యాలు హృదయం. తనివిదీర ఒక్క ముద్దు పెట్టుకోవాలని హృదయం తహతహ లాడింది. ఆ వాంఛతో పాటు బాల్యస్మృతులు కూడ లీలగా మనస్సులో మెదిలాయి. అవును! ఎప్పు

దైనా, ఏదైనా అమ్మ అడిగినదానికి తడుముకోకుండా చిలిపిగా బదులు పలికితే ఆమె హృదయం కొండంత అయ్యేది. గుండెల కదుముకొని, "ఎంత తెలివమ్మా నా దొరకి! ఏడూళ్ళు ఏలి తీరుతాడు!" అంటూ సంతృప్తిగ నిట్టూర్చేది. మాటల్లో కోరికలు కోరికలుగానే నిలబడితే, ఆ నిట్టూర్పుల్లో బాధలు మాత్రం తన్ను వదలిపెట్టడంలేదు. ఇల్లు వదలింది మొదలు ఈనాటి వరకు ఇలాంటి ఘటన కానీ, ఆలోచించే ఆస్కారంకానీ కలుగలేదు. ఈ నాడు తన హృదయం ప్రేమతో తొణికిసలాడుతూ ఉంది! అందుకే నేమో రెండు చేతులతో ఆ అమ్మాయిని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకో బోయాడు. మాసిన గుడ్డలు, గిజిగాని గూడు లాంటి గడ్డము, నెత్తిన ముంతడు నీళ్ళు చల్లుకొని ఎన్నాళ్ళయిందో, అదో విధమైన వాసన, పాపం! రమకు తగని అసహ్యమేసిందో! ఆ ఆకారానికి జడసుకొనిందో—లేదు సహజమైన సిగ్గు పొటమరిచిందో? తెలియదుకానీ, పట్టు తప్పించుకోవాలని విలవిల కొట్టుకొంటూ ఉంది. ముత్యాలు అదేమీ గమనించే స్థితిలో లేడు. అంతలోనే తన చెంప 'ఛెళ్ళు' మనింది. ఆ దెబ్బతో పట్టువదలి పైకి లేచి నిలబడ్డాడు. చెంపమీది చేతిప్రేళ్ళ గుర్తులను మాసినగడ్డం మూసి పెట్టినా, కెంపు తిరిగిన కనుగుడ్లు మాత్రం కన్నీళ్ళను కప్పిపుచ్చలేక పోయాయి. ఆణిముత్యాల్లా టపటప నేలరాలి, ఇంకి పోయాయి—అది వాటి లక్షణం కాబట్టి!

"ఎవడివిరా నువ్వు....ఒంటరిపాటున చేతికి చిక్కిందని గొంతు పిసికి పారేద్దామనుకొన్నావా?....ఉండు నిన్ను పోలీసుల కప్పచెప్ప తాను!"—అంటూ పొగలు గక్కుతున్నాడు రమ తండ్రి నీలమేఘం.

"అదేనండీ! నేను చెబితే మీరేమీ పట్టించుకోక పోతిరి. పాప అరచి నట్లుంది చూడండి—అంటే, పసిపిల్లలతో కలిసి గోల చేస్తూ ఉంటుం దంటిరి. ఇప్పుడే గనక రాకపోతే పాపగతి ఏమై ఉండేది?....అయ్యో! నా చిట్టితల్లీ!!" అని వాపోతూ ఉంది - రమతల్లి లీలావతమ్మ.

అంత దుస్థితిలో కూడ ఆ యిరువురిని ఒక్కసారి పరీక్షగా చూచి ఓ చిరునవ్వు నవ్వాడు ముత్యాలు!

"........పైగా నవ్వుతావటరా నువ్వు? నే నెవడనుకొన్నావో ఏమో? అనుకొంటే నిన్ను నిముషాలమీద అరెస్టు చేయించగలను" గుడ్లురుముతున్నాడు నీలమేఘం.

వింతగా అతనివైపు చూస్తున్నాడు ముత్యాలు. ఇదంతా ఏమీ అర్థం చేసుకోలేని రమ మాత్రం తల్లి కాళ్ళు పొదివి పట్టుకొని బిక్క చూపులు చూస్తూ వుంది. ఏమో చెప్పాలని ఆరాటపడే ఆపసి హృదయం, తండ్రి ఉధృతాన్ని చూచి అసలే మరచిపోయింది.

"ఎవడో పిచ్చి వెధవలాగున్నాడు. వాడితో ఎందుకు పోనీలెండి!" అంటూ రమను చంకన వేసుకొని వెళ్ళిపోయింది లీలావతమ్మ. మళ్ళీ ఒక్కసారి నవ్వాడు ముత్యాలు.

"అయ్యో! పిచ్చితండ్రీ!! పోలీసులు జైళ్ళు నాకేమీ కొత్తగాదు. మీరనుకొన్నంత పనిచేయడానికి కూడ సమర్థులే. అయితే నేను నవ్వడమంతా నా అదృష్టాన్ని తలంచుకొని!" అన్నట్లుంది ఆ నవ్వు. ఆ నవ్వుతో మరీ రెచ్చిపోయాడు నీలమేఘం.

"ఏరా! నీకంతా నవ్వులాటగా ఉంది కదూ?!....అయితే ఉండు!" అంటూ ఒక్క ఊపులో ఇంటివైపు వెళ్ళాడు నీలమేఘం.

ఇక్కడ ముత్యాలు తనను గురించి, ఆపైన భగవంతుని ఆస్తిత్వాన్ని గురించి కాసేపు ఆలోచించవలసి వచ్చింది. ఏమిటో తన బ్రతుకు తనకే అర్థంకావడంలేదు. పుణ్యానికిపోతే పాపమెదురవుతూ వుంది. పాపం!.... ఎప్పుడో, ఎక్కడో, అనుభవించవలసిన కష్టాలకు చక్కని నామకరణం. ఇక్కడే, ఇప్పుడే తనని ఓరాగాన వదలిపెట్టడం లేదు. మొలలోతు నీళ్ళల్లో తలమునిగేవరకు ముంచి, ఊపిరాడకుండాచేసి తీరా ఆ కాస్త ఊపిరిపోబోయే సరికి 'పోనీలే!' అని దయతలచి వదలిపెడుతూ ఉంది. తానుచేసిన తప్పేమి?

తనను, తన పుట్టుకను హేయభావంతో అవహేళనచేసే వాతావరణాన్ని వదలిరావడం తప్పా? కండ్లముందు జరిగే అన్యాయాలకు అడ్డుతగలడం తప్పా? లేదు. సాంఘిక నీతినియమాలను ప్రేమించడం తప్పా? అనుభవం సముపార్జించిన తెలివితో ముత్యాలు ఆలోచనా పరంపర ఓ స్థాయిలో సాగిపోతూ ఉంది. ఆలోచనతో పోటీపడ్డ ముత్యాలు, నీలమేఘాన్ని, ఆయన పంతాన్ని పూర్తిగా విస్మరించాడు.

"ఓ!....వీడా?" మాట, మాటవెంబడి నవ్వు, ఒకదాని నొకటి తరుముతున్నట్లుగ వూడిపడ్డాయి - ఉన్నట్టుండి! ఉలిక్కిపడి లేచినిలబడ్డాడు ముత్యాలు. ఎదురుగ పోలీసు ఆఫీసరు తనివిదీర నవ్వుతున్నాడు. ఆ నవ్వులో పరిచయస్తుణ్ని గుర్తించిన పట్టు, పోలీసు ఆఫీసరు బెట్టు నిండుగా ఉన్నాయి. నీలమేఘం దర్పంగా చూస్తున్నాడు. 'చూశావా నా దెబ్బ?' అన్నట్లున్నాయి ఆ చూపులు. 'వదిలితే చాలు!' అని వేటకుక్కల్లా వేచి వున్నారు పోలీసులు.

ఒకసారి చేతిలో డైరీవైపు, మరొక్కసారి ముత్యాలువైపు చూశాడు పోలీసు ఆఫీసరు సందేహ నివృత్తికోసం. సందేహానికి తావు లేకపోతే, విచారణకు అవసరమే లేకపోయింది. 'ఊఁ!' అన్నాడు పోలీసు దొర. ముందు వెనకాడకుండా ముంజేతులకు కంకణాలు తొడిగారు ముత్యాలకు పోలీసులు. తమ పాత చుట్టాన్ని గుర్తించడంలో వాళ్ళేమీ పొరపాటు పడలేదు. తత్ఫలితంగా "అత్తగారింటి ఆదరణ" ద్విగుణీకృతమై ఆరేళ్ళు అతనిని వదలి పెట్టలేదు!....

* * * *

ఆరేళ్ళ తర్వాత మళ్ళీ బయట పడ్డాడు. బయటపడిందే తడవుగా నడుస్తున్నాడు. ఎటుపడితే అటుగాకుండా దారివెళ్ళినట్లు తాను వెళ్ళుతున్నాడు. ఆ నడకలో ఏదో నిర్ణయం!....ఆ ఆకారంలో ఏదో ఆక్రందనం!.... ఆ చూపుల్లో ఏదో అన్వేషణ!....ఏమిటో అతని గమ్యం?

ముత్యాలు తన నడక మానలేదు. అయితే మాత్రం ఎంతకాలమని అలా కాలంతో పోటీ పడగలుగుతాడు? పరిస్థితు లనుకూలించినంతవరకూ మానమన్నా మానలేడు. కానీ, ఆపైన మాత్రం ఆగక తప్పదు.

ఓ పల్లెముందు చెట్టుక్రింద కూర్చున్నాడు ముత్యాలు. ప్రొద్దు గూట్లో పడుతూ పడుతూవుంది. మేతకోసం రెక్కలకొద్దీ ఎగిరి, దేశమంతా గాలించి, పొట్టనింపుకొన్న పక్షులు గూళ్ళుచేరడానికి గుంపులు గుంపులుగా వస్తున్నాయి. అడవికి మేతకు వెళ్ళిన ఆలమందలు ఇంటిముఖంపట్టి, గెవిన్లో ఎదురుపడ్డ లేగదూడలను ఎదకు హత్తుకోలేకపోయినా శరీరమంతా నాకుతున్నాయి ఆప్యాయంగా. పొలంనుండి అరమూట ధాన్యాన్ని మోయలేక మోసుకొస్తున్న మగనికి ఎదురైన మగువ, ఆ మూటనందుకుంటే, అతగాడు మెడ విరుచుకొంటూ, కొంటె చూపులు చూస్తున్నాడు. ఆ చెట్టు క్రిందనే కంసాలి కొలిమి. బూడిదనంతా తీసి ఆ ప్రక్కన్నే గుట్టగా పోశారు. ఆ బూడిదలో పడుకొంది ఓ కుక్క. సుమారు నాలుగైదు చంటిపిల్లలు పాలు జుర్రుకొంటుంటే ఎంతో ఆప్యాయంగా పిల్లలవైపు చూస్తూ మైమరచి పడివుంది ఆ కుక్క. అన్నిటినీ పరీక్షగా చూశాడు ముత్యాలు. కాలచక్ర గమనంలో ఇలాంటి సంఘటనలు తనకంట పడకుండా ఉండడానికి, నాలుగు గోడలమధ్య కట్టుదిట్టాలతో పెంచబడిన బుద్ధుడు కాదు తానేమీ! అయితే ఏనాడూ ఇలాంటి అనుభూతి మాత్రం అతనికి కల్గలేదు. అదేమి చిత్రమో సృష్టి అంతా ప్రేమమయంగా గోచరిస్తోంది. కాగా అతని వదనం ప్రసన్నతతో తొణికిసలాడింది. లేని ఉత్సాహం నరాలమీద పనిచేస్తే మళ్ళీ మెల్లగా ముందుకు సాగాడు. బహుశా ఇంత కరుణామయమైన ప్రపంచంలో కాస్త చోటు, సహృదయతకు కాస్త సానుభూతి లభించకపోదులే అన్న ఆశతోనేమో!

ఆ ఆశతోనే మూడామడలు కాళ్ళీడ్చుకుంటూ వచ్చి కూలబడ్డాడు ఆ వెలగ చెట్టుక్రింద గుంటలో గుక్కెడు నీళ్లు త్రాగి. అక్కడ తన

కంటపడింది ఆ పదేళ్ళ కుర్రవాడు. వాణ్ణి చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. తనను గురించి ఆలోచించే వాళ్ళు లేక తన్నుకు చస్తూంటే తాను ఇంకొకరిని గురించి ఆలోచిస్తున్నాడు - తన్ను మాలిన ధర్మంలా.

పాపం! వాడూ తనలాగే వీధులపాలై వుంటాడు. కంటికి నున్నగా కనిపించిన వాడినంతా, "చదువుకోవాలి! తల్లీ తండ్రి ఎవ్వరూలేరు. సాయంచేయండి" అని బ్రతిమాలి ఉంటాడు. అది ఫలించకపోగా, పని కోసం ప్రాధేయపడి ఉంటాడు. "ఊరూ పేరూలేని వెధవలకు పనెవ రిస్తారు? పోరా!!" అని కసిరికొడతే తిట్లకు, చీవాట్లకు అలవాటుపడి కడకు అడుక్కు తినడానికి తయారయి ఉంటాడు. నాలాంటి, ఇలాంటి దౌర్భాగ్యు లెందరున్నారో ఈ లోకంలో? అబ్బ! ఎంత విషాదం గూడు కట్టుకొని వుంది ఆకళ్ళల్లో! ఎన్ని కన్నీళ్ళు నిట్టూర్పు సెగలతో ఆవిరై పోయాయో ఆ చెక్కిళ్ళపై!....

దారిన పోతూండిన ఆ పదేళ్ళ పిల్లవానిని గురించిన ఆలోచనా స్రవంతి గుండెల్లో పొంగి తన జీవితంతో ఓ సమన్వయాన్ని కుదుర్చు కొనేసరికి ఏదో అవ్యక్తమైన సానుభూతీ—ఆ కుర్రవాని భవిష్యత్తుపై నిష్ఫలమైన ప్రీతి-తనను వీపుతట్టితే పైకి లేవబోయాడు ఎంతో ప్రయాసతో! మూన్నాళ్ళుగా పట్టి కడుపు. పైన కాసిన్ని మంచినీళ్ళు పడడం. పైత్యం ప్రకోపించిందేమో?—ఎవరి మాటలో అలా ఉంచి శరీరం తన మాటలనే లెక్కచేయడంలేదు. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఎట్లో నిబ్బరించుకొని 'బాబూ!' అంటూ ఒక్క అడుగు ముందుకు వేయ బోయాడు. అంతే....

ఎక్కడో అత్తగారి పోటుకుతో అల్లాడిపోయే ఓ మహాసాధ్వి తెగించి పిడికెడు మెతుకులు దోసెడు తెచ్చి విదిలిస్తే సంతృప్తిగా నవ్వుకొన్నాడు ఆ పదేళ్ళ కుర్రవాడు.

ఒక్క అడుగు ముందుకు వేయలేని నీరస స్థితిలో కుప్పగా కూల బడ్డాడు ముత్యాలు. కాలచక్రం ఒడిదుడుకుల్లో చిక్కుకొని, ఢక్కాముక్కీలు తిన్న తనువులాంటి ఎముకల గూడు నేలకు అతుక్కుపోయినా, గూట్లో నిశ్చలంగా దివ్వెల్లా వెలిగే సునిశితమైన దృక్కులుమాత్రం దేవులాడుతూనే ఉన్నాయి దేనికోసమో?

ఏమనుకొనిందో ఏమో? లోకం నవ్వింది!

దాని తీరే అంత మరి!!

*